క్లుప్తంగా

మృతురాలి నేత్రాల సేకరణ

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేట ప్రాంతానికి చెందిన నక్క అనుసూయ (65) అనారోగ్య సమస్యలతో గురువారం తెల్లవారు జామున మృతి చెందారు. కుటుంబ సభ్యులు యుగేందర్, దేవేందర్, భర్త నరసయ్య, కుమార్తెల అంగీకారం మేరకు మృతురాలి నేత్రాలను తెలంగాణ నేత్ర, అవయవ, శరీర దాతల అసోసియేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ప్రాంతీయ నేత్ర వైద్యశాల, ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ నిపుణుడు లక్ష్మణ్ నేతృత్వంలో గురువారం మధ్యాహ్నం సేకరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రెడ్డి మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేయూ జువాలజీ విభాగం అధిపతిగా షమిత



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ జువాలజీ విభాగం అధిపతిగా ప్రొఫెసర్ షమితను నియమిస్తూ కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు మామిడాల ఇస్తారి నుంచి గురువారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఆ విభాగం అధిపతిగా అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మామిడాల ఇస్తారి బాధ్యతలు నిర్వర్తించారు. రెండేళ్ల పదవీకాలం పూర్తి కావటంతో ఆయన స్థానంలో షమితను రిజిస్ట్రార్ నియమించారు. ఆమెకు జువాలజీ విభాగం ప్రొఫెసర్ కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ ఈసం నారాయణ, హాస్టళ్ల డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ వెంకయ్య, తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

రేపు మెగా జాబ్‌మేళా



నయీంనగర్: నిత్యావసరాలను నగర ప్రజలకు ఇంటివద్దకే అందించేందుకు నగరంలో డుసిల్ కార్ట్ 9స్టోర్లను త్వరలో ప్రారంభించనున్నట్లు డుసిల్ కార్ట్ చైర్మన్ క్రాంతికుమార్, డైరెక్టర్ నాగశృతి తెలిపారు. అందు కోసం అవసరమైన 513మందికి పైగా సిబ్బంది కోసం ఈనెల 21న వరంగల్ ఏవీవీ కళాశాలలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు చెప్పారు. హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి ఇంటికి అవసరమయ్యే నిత్యావసరాలను 10నిమిషాల్లో ఇంటివద్దకు చేర్చేందుకు నగరంలో డుసిల్ కార్ట్ 9స్టోర్లను త్వరలో ప్రారంభించనున్నట్లు వివరించారు.

ఆలయంలో చండీహోమం



కాజీపేట: కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవాలయ ఆవరణలో గురువారం చండీహోమం నిర్వహించారు. అయినవోలు ప్రవీణ్‌కుమార్ శర్మ ఆధ్వర్యంలో దుర్గమాతకు ప్రత్యేక పూజలతో పాటు చండీహోమం జరిపించారు. శివ – శక్తి యూత్ అసోసియేషన్ సభ్యుల పర్యవేక్షణలో భక్తులకు అన్నదానం చేశారు. రాపాక శ్రీనివాస్ శర్మ, యుగంధర్, మిట్టపల్లి రవీందర్, బీ.రంజిత్ కుమార్, నాగవెల్లి శ్రీధర్, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సీపీని కలిసిన బీఎన్ఆర్‌కేఎస్ నాయకులు



కాజీపేట అర్బన్: వరంగల్ పోలీస్ కమిషనరేట్‌లో సీపీగా బాధ్యతలు స్వీకరించిన అంబర్ కిషోర్ ఝాను బీఎన్ఆర్‌కేఎస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఎన్ఆర్‌కేఎస్ రాష్ట్ర కార్యదర్శి, హనుమకొండ జిల్లా ఇన్‌చార్జ్ పంకెర్ల కుమారస్వామి యాదవ్, మూలవీర నర్సింహులు, ఐలయ్య, సంపత్, అజీమొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

రొట్టెబండ వాసుల మద్దతు

మడికొండ: వర్ధన్నపేట బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి, ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను ప్రశాంత్‌నగర్‌లోని ఆయన నివాసంలో కాజీపేట మండలం మడికొండ శివారు రొట్టెబండ ప్రజలు గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు తమ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తూ ఏకగ్రీవ తీర్మానం చేశారు. కార్యక్రమంలో వడ్డెర సంఘం నాయకులు వల్లెపు ఉపేందర్, ఎత్తరి పెద్ద వెంకటయ్య, పల్లపు యాదగిరి, రాజేందర్, ఎత్తరి రమేష్, రాజు, వల్లెపు కుమార్, తిరుపతి, జేసీబీ రవి, పిట్ల మైబెల్లి, దారంగుల సంతు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

హసన్‌పర్తి: హసన్‌పర్తి మాజీ సర్పంచ్ కోడెల సాంబయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే అరూరి రమేష్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. దండుగుండం రాజ్‌కుమార్‌ను పరామర్శించారు. అనారోగ్యంతో బాధపడుతున్న అట్ల కర్ణాకర్, సాయిని బిట్లు, వేల్పుల పెద్ద రవి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

పూజలందుకుంటున్న అమ్మవారు



కాజీపేటలో శాకంబరి అలంకరణలో దుర్గామాత



కడిపికొండ చంద్రమౌళేశ్వర దేవాలయంలో..



హసన్‌పర్తి: ముచ్చర్లలో పూజలు చేస్తున్న భక్తులు

కాజీపేట: కాజీపేట భ్రమరాంబిక మల్లికార్జునస్వామి దేవాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన దుర్గామాతను భక్తులు గురువారం రాత్రి శాకంబరి మాతగా అలంకరించారు. అమ్మవారిని పలు కూరగాయల దండలతో దేవాలయ ప్రధాన అర్చకుడు ఐనవోలు ప్రవీణ్‌కుమార్‌శర్మ ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి అలంకరణకు అవసరమైన కూరగాయలను గాయత్రి స్వీటు హౌస్ యజమాని బస్తీమాల్ కొల్హారియా, లక్ష్మణ్, దీపక్ కొల్హారియా కుటుంబ సభ్యులు అందించారు. కార్యక్రమంలో శివ – శక్తి యూత్ అసోసియేషన్ సభ్యులు మిట్టపల్లి రవీందర్, బెదరకోట రంజిత్‌కుమార్, నాగవెల్లి శ్రీధర్, విజయ్, ప్రశాంత్, రాహుల్, భరత్, సతీష్, గణేష్‌సింగ్, రౌతు కమల్‌కుమార్, రఘు, అశోక్ పాల్గొన్నారు.

లలితా అమ్మవారిగా రాజరాజేశ్వరిదేవి

హన్మకొండ కల్చరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వరంగల్ ఎంజీఎం ఎదురుగా ఉన్న రాజరాజేశ్వరిదేవి ఆలయంలో లలితా పంచమిని పురస్కరించుకుని అర్చకుడు ఎల్లంభట్ల లక్ష్మణశర్మ ఆధ్వర్యంలో అమ్మవారిని లలిత అమ్మవారిగా అలంకరించి గురువారం పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ వద్దిరాజు వెంకటేశ్వరరావు పర్యవేక్షించారు.



హన్మకొండ కల్చరల్: లలిత అమ్మవారిగా రాజరాజేశ్వరి

శాకంబరి అలంకరణలో దుర్గామాత

కాజీపేట అర్బన్: 13వ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని చంద్రమౌళీశ్వర దేవాలయంలో దుర్గామాతను గురువారం శాకంబరి మాతగా అలంకరించారు. ఆకుకూరలు, కూరగాయలతో అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించినట్లు ఆలయ పూజారి జాగర్లపూడి శ్రీనివాసశర్మ తెలిపారు.

ముచ్చర్లలో దుర్గామాతకు పూజలు

హసన్‌పర్తి: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ముచ్చర్లలో ప్రతిష్ఠించిన దుర్గామాతకు ప్రత్యేక పూజలు గురువారం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కార్యక్రమంలో స్థానికులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీధర్, చిర్ర రాజేష్, రాణి, భాగ్యలక్ష్మి, సాయిరెడ్డి, రాజేష్, కంచనకుంట్ల శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష్మీసహస్ర మహాయాగం

హన్మకొండ కల్చరల్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా హనుమకొండ ఎక్సైజ్‌కాలనీ ఫేస్ –2 అగ్రతి గజానన మండలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో లక్ష్మీ సహస్ర మహాయాగాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ప్రముఖ జోతిష్య వాస్తు పండితుడు సౌమిత్రి లక్షణాచార్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చినజీయర్ స్వామి ఆశీస్సులతో దేవనాథ రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు మహాయాగం కొనసాగుతుందని తెలిపారు.

నవరాత్రి ఉత్సవాల్లో అన్నదానాలు



కాశిబుగ్గ రంగనాథస్వామి ఆలయంలో..



ఖిలా వరంగల్: పెరికవాడలో..



మడికొండ: దుర్గామాత వద్ద అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

కాశిబుగ్గ: దేవీ నవరాత్రులను పురస్కరించుకుని కాశిబుగ్గలోని రంగనాథస్వామి దేవాలయంలో భక్తులకు గురువారం అన్నదానం చేశారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రముఖ ఆడిటర్ గోసికొండ సుధాకర్, శకుంతల దంపతులు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూరి సురేష్, అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, రామాచార్యులు, విక్కి, భాస్కర్, సుల్తాన, సమ్మక్క, కవిత, సృజన తదితరులు పాల్గొన్నారు.

యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

ఖిలా వరంగల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా వరంగల్ రైల్వేగేట్ పెరికవాడలో శివసేన యూత్ అసోసియేషన్, మాజీ కార్పొరేటర్ దిడ్డి నాగరాజు ఆధ్వర్యంలో కనకదుర్గమ్మకు గురువారం ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా ఎక్సైజ్ శాఖ రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ దిడ్డి నరేందర్ హాజరై కనకదుర్గమ్మను దర్శించుకుని మహాన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గజ్జెల లింగమూర్తి, అడప అవినాష్, తన్నీరు శ్రీకాంత్, పగిడిపాల ప్రశాంత్, గడ్డం మహేష్, పోతుగంటి కార్తీకారండ చార్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఫైవ్‌స్టార్ యూత్ ఆధ్వర్యంలో..

మడికొండ: కాజీపేట మండలం మడికొండ వేణుగోపాల స్వామి ఆలయం వద్ద ఫైవ్ స్టార్ యూత్ ఆధ్వర్యంలో దుర్గామాత విగ్రహం వద్ద గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు, ఆలయ చైర్మన్ నిగ్గుల సతీష్‌కుమార్, పత్తిపాక ఉపేంద్రచారి, రాకేష్, సాంబరాజు, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను ఇంటింటికి తీసుకెళ్లాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రమేష్

కరీమాబాద్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతీ ఇంటికి తీసుకెళ్లాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేష్ అన్నారు. 43వ డివిజన్ సమన్వయ కమిటీ సభ్యులు, గ్రామ శాఖ అధ్యక్షులు, ముఖ్య నాయకులతో మామునూరులో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు నల్లేరుపై నడకే అని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో 43వ డివిజన్ కార్పొరేటర్ ఈదురు అరుణతోపాటు నాయకులు పాల్గొన్నారు. అలాగే, దసరా పండుగను పురస్కరించుకుని జక్కలొద్దిలో నిర్వహిస్తున్న వాలీబాల్ పోటీలను ఎమ్మెల్యే రమేష్ ప్రారంభించారు. 43, 44వ డివిజన్ జక్కలొద్ది, తిమ్మాపురం గ్రామాలకు చెందిన కుమ్మరి చెన్నమ్మ, పేర్ల కొమురయ్య, నీలం ఐలయ్య, బండి ఎల్లయ్యలు ఇటీవల అనారోగ్యాలతో మరణించగా, వారి కుటుంబాలను పరామర్శించారు.

అలరించిన 'కార్యక్రమాలు'

హన్మకొండ కల్చరల్: హనుమకొండలోని పద్మాక్షి దేవాలయంలో జరుగుతున్న శరన్నవరాత్రుల్లో భాగంగా అన్నమాచార్య ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో దేవాలయంలో గురువారం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అకాడమీ వ్యవస్థాపకుడు సూత్రపు అభిషేక్ అధ్యక్షత వహించి ప్రముఖ అర్చకుడు షణ్ముక పద్మనాభ అవధాని పాల్గొని కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీదుర్గ నృత్యాలయం గురువు గంప శైలజ శిష్య బృందం, వీఎల్ఎస్ నృత్య కళాక్షేత్రం పురావస్తు హర్షిత, హరితా నృత్యాలయం హరిత, ప్రముఖ గాయకులు ఉమ్మడి లక్ష్మణాచారి, సూత్రపు శేషయ్య, చిన్ని, చరణ్ పాల్గొన్నారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి



వేదికను పరిశీలిస్తున్న డీసీపీ బారి, తదితరులు

కరీమాబాద్: దసరా వేడుకలను ప్రజలు ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని సెంట్రల్ జోన్ డీసీపీ ఎంఏ.బారి సూచించారు. వేడుకలు నిర్వహించే వరంగల్ ఉర్సుగుట్ట రంగలీల మైదానాన్ని గురువారం ఆయన సందర్శించి ఏర్పాట్ల గురించి కమిటీ బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం, ట్రాఫిక్ పాయింట్లు, ట్రాఫిక్ డైవర్షన్, సీటింగ్ అరెంజ్‌మెంట్, బారికేడ్లు, తాత్కాలిక సీసీ కెమెరాల ఏర్పాటు వంటి పలు అంశాలపై ఏసీపీ బోనాల కిషన్, మిల్స్‌కాలనీ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కు పలు సూచనలు చేశారు. బతుకమ్మ నిమజ్జనం సందర్భంగా ఎలాంటి సమస్యలు రాకుండా, మహిళలకు ఇబ్బంది కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో దసరా ఉత్సవ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు నాగపురి సంజయ్‌బాబు, మేడిది మధుసూదన్, మండ వెంకన్న, వొడ్నాల నరేందర్, కోటేశ్వర్, శివమూర్తి, రాంప్రసాద్, రంజిత్, అనిల్, సందీప్, సంజీవ్, వాసు, శ్రీనివాసులు, అజయ్, అఖిల్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులను విస్మరించిన బీఆర్ఎస్



మాట్లాడుతున్న కన్నం సునీల్

హన్మకొండ అర్బన్: బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులను విస్మరించిందని, ఇటీవల బీఆర్ఎస్ పార్టీ ప్రకటించిన మేనిఫెస్టోలో విద్యార్థులు, నిరుద్యోగులు, యువకులకు సంబంధించి కనీస హామీ లేకపోవడంతో శోచనీయమని బీఎస్పీ వరంగల్ రీజియన్ సెక్రటరీ కన్నం సునీల్ విమర్శించారు. బాలసముద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం జరిగిన బీఎస్పీ గ్రేటర్ వరంగల్ నగర కమిటీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేపర్ లీకేజీ, ఇతరత్రా కారణాలతో నియామకాలు చేపట్టకపోవడంతో నిరుద్యోగుల ఆశలు అడియాశలు అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్.. నిరుద్యోగుల ప్రాణాలతో చెలగాటం ఆడుతూ వాళ్ల తల్లిదండ్రులకు కడుపుకోత మిగుల్చుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో బీఎస్పీ గ్రేటర్ వరంగల్ నగర కమిటీ అధ్యక్షుడు వేల్పుల శంకర్, ఉపాధ్యక్షుడు ధనరాజ్, అధికార ప్రతినిధి మార్క రాహుల్, జనరల్ సెక్రటరీ కందుకూరి యువకిషోర్, సెక్రటరీ మామిడి నాగరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

చెరువులో నిర్మాణాల కూల్చివేత



వరంగల్ అర్బన్: వరంగల్ భద్రకాళి చెరువు ఫుల్ ట్యాంక్ లెవల్(ఎఫ్‌టీఎల్), బఫర్ జోన్లలో నిర్మించిన అనధికారిక ప్రహరీలను బల్దియా టౌన్ ప్లానింగ్ అధికారులు గురువారం కూల్చివేతలు చేపట్టారు. డీఆర్ఎఫ్ సిబ్బంది ద్వారా జేసీబీల సహకారంతో నిర్మాణాలు నేలమట్టం చేశారు. భద్రకాళి బండ్‌కు సమీపంలో సుమారు రెండు ఎకరాల్లో నిర్మిస్తున్న ప్రహరీలను తొలగించారు. కూల్చివేతల్లో ఏసీపీ టౌన్ ప్లానింగ్ అధికారులు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి పరిరక్షణకు కృషి చేయాలి



విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న రావు పద్మ

హన్మకొండ: ఎంతో విశిష్టత కలిగిన హిందూ సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు తామంతా కలిసికట్టుగా నిరంతరం చేయాలని, అప్పుడే జాతి వైభవాన్ని భావితరాలకు అందించవచ్చని సామాజిక వేత్త రావు పద్మ అన్నారు. శ్రీభారతీ సాహితీ సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు చొల్లేటి కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో హనుమకొండ 10వ డివిజన్‌లోని మచిలీబజార్‌లో గురువారం సాయంత్రం బతుకమ్మ, భక్తి, జానపద, గేయ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ముగింపు ఉత్సవాలకు రావు పద్మ హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో పూలను పూజించే గొప్ప సంస్కృతి ఉందని కొనియాడారు. స్థానిక కేబుల్ టీవీ యజమాని నాసం కరుణ, ప్రెస్‌క్లబ్ జాయింట్ సెక్రటరీ పాడిశెట్టి విష్ణువర్ధన్ సహకారంతో నిర్వహించిన కార్యక్రమంలో మాడిశెట్టి శ్రీనివాస్, ఎడెల్లి ఎల్లారెడ్డి, సిరికొండ కవిత, శ్రీధర్, రావుల్‌కార్ శైలజ, పిన్నింటి జ్యోతి, గుండాల అనురాధ, సుజాత, సంపత్, సత్యనారాయణ, ఠాకూర్ మోతీసింగ్, రామోజు నాగ, గోపాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జంగాకు టికెట్ ఇవ్వకుంటే సహాయ నిరాకరణ



మాట్లాడుతున్న తొట్ల రాజుయాదవ్

కాజీపేట: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్‌ను డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డికి ఇవ్వకుంటే సహాయ నిరాకరణ చేస్తామని మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు యాదవ్ హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి కాజీపేట మీడియా పాయింట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆది నుంచి కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కుగా ఉంటున్న జంగా సేవలను పార్టీ పెద్దలు గుర్తించాలని కోరారు. బోగస్ సర్వేల పేరుతో సమర్థవంతమైన నాయకుడికి అన్యాయం చేయడం తగదని హితువు పలికారు. కార్యక్రమంలో మడిపల్లి సర్పంచ్ చిర్ర రమేష్, స్వామి, వస్కుల శంకర్, బైరు లింగమూర్తి, బిల్లా రవీందర్, కూర్ల మోహన్, యాదవ రెడ్డి, నరేందర్‌రెడ్డి, బీరం మౌనిక, దేవేందర్ రెడ్డి, కోర్నెలు, గంగుల శ్రీనివాస్ రెడ్డి, కట్కూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

గిరిజనులను విస్మరించిన ప్రభుత్వం

ఖిలా వరంగల్: స్వరాష్ట్రంలో గిరిజనుల సంక్షేమాన్ని బీఆర్ఎస్ ప్రభుత్వం విస్మరించిందని గిరిజన సమాఖ్య వరంగల్ జిల్లా అధ్యక్షుడు లావుడియ దస్రు నాయక్ ఆందోళన వ్యక్తం చేశారు. వరంగల్ శివనగర్‌లోని సీపీఐ తమ్మెర భవనంలో భూక్య రామకృష్ణ అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో దస్రు నాయక్ మాట్లాడారు. దళితబంధు పథకం తరహాలోనే పేద గిరిజనులకు గిరిజన బంధు పథకాన్ని తీసుకురావాలని సూచించారు. సమావేశంలో బోడ దేవిక, పార్వతి, లక్ష్మి, భద్రి పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

కేయూ క్యాంపస్: విద్యార్థులు చదువుతోపాటు తమకు ఇష్టమైన క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని హనుమకొండలోని సుబేదారి ఎస్సై రవికిరణ్ అన్నారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల మైదానంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌లో ఆయన మాట్లాడుతూ ఆత్మవిశ్వాసం, పట్టుదలతో కృషి చేస్తే ఏదైనా సాధ్యమేనని వివరించారు. డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నోముల కిషోర్, కార్యదర్శి తిరుపతి, జిల్లా ఉపాధ్యక్షుడు మంద సుచందర్, జిల్లా నాయకులు శివరాత్రి కరుణాకర్, సుముద్రాల అనిల్, మెట్టు సమ్మయ్య, రామకృష్ణయ్య పాల్గొన్నారు.

కొండా సురేఖకు పరామర్శ

హన్మకొండ: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చేపట్టిన నిరుద్యోగ బైక్ ర్యాలీ యాత్రలో పాల్గొన్న మాజీ మంత్రి కొండా సురేఖ.. ప్రమాదవశాత్తు బైక్‌పై నుంచి కిందపడి గాయాల పాలయ్యారు. హనుమకొండలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా ఆమెను హనుమకొండ కాంగ్రెస్ మహిళా జిల్లా అధ్యక్షురాలు బంక సరళ పరామర్శించారు.

రావణవధకు ఏర్పాట్లు

రామన్నపేట: నగరంలోని కొత్తవాడ తోట మైదానంలో భద్రకాళి దసరా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రావణవధ ఏర్పాటు పనులను స్థానిక కార్పొరేటర్ బస్వరాజ్ కుమార్ గురువారం ప్రారంభించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సిరబోయిన రాజు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

బతుకమ్మ, దసరా ఉత్సవ ఏర్పాట్ల పరిశీలన

కాశిబుగ్గ: కాశిబుగ్గ చిన్నవడ్డేపల్లి చెరువు ప్రాంగణంలో నిర్వహించనున్న బతుకమ్మ, దసరా వేడుకల ఏర్పాట్లను ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ గురువారం సాయంత్రం పరిశీలించారు. రానున్న రోజుల్లో రూ.27 కోట్ల వ్యయంతో చిన్నవడ్డేపల్లి బండ్ అభివృద్ధి జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షులు దూపం సంపత్, బయ్యస్వామి, ఆర్‌టీఏ సభ్యుడు గోరంటల మనోహర్, ఓని భాస్కర్, వేముల నాగరాజు, క్యాతం రవీందర్ పాల్గొన్నారు.

గొడవను కాపు సంఘానికి ఆపాదించొద్దు

ఖిలా వరంగల్: ఓ చానల్ డిబేట్‌లో బీఆర్ఎస్, బీజేపీ మధ్యలో జరిగిన ఘర్షణను మున్నూరు కాపు సంఘానికి రద్దుడం సరికాదని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు మంద శ్రీనివాస్ అన్నారు. డిబేట్‌లో ఎక్కడా ఏ ఒక్క పదం కూడా మున్నూరు కాపు సంఘానికి సంబంధించినది లేదని అన్నారు. వరంగల్ 33వ డివిజన్ శాంతినగర్‌లో గురువారం జరిగిన మున్నూరుకాపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా మున్నూరు కాపులకు ఏమి చేశారో చెప్పాలని నరేందర్‌ను ప్రశ్నించారు. రాజకీయాలకు అతీతంగా కాపు సంఘం ఏర్పడిందని వివరించారు. సమావేశంలో ఇనుముల అజయ్, ఆకుతోట రాజు, తోట సురేష్, ఉప్పుల సురేందర్, యాదగిరి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

కాజీపేట: 63వ డివిజన్‌కు చెందిన పలు పార్టీల కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరారు. ఈమేరకు కాజీపేట బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో వారికి తెలంగాణ జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాస్యం విజయ్‌భాస్కర్ కండువాలు కప్పి పార్టీలోకి గురువారం ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి దాస్యం వినయ్‌భాస్కర్ గెలుపునకు కార్యకర్తలు కష్టించి పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బెదరకోట రంజిత్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు సుంచు అశోక్, కోల వినోద, ఫర్వీన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఫైలేరియా నిర్ధారణ పరీక్షలు

గీసుకొండ : వరంగల్ జిల్లాలో ఫైలేరియా వ్యాధి ప్రభావం ఉన్న 21గ్రామాల్లో శుక్రవారం రాత్రి 8 గంటల నుంచి 11 గంటల వరకు ఫైలేరియా వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం రక్త నమూనాలు సేకరించనున్నట్లు జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుధార్‌సింగ్ తెలిపారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఫైలేరియాపై పీహెచ్‌సీల వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. జోనల్ కన్సల్టెంట్ డాక్టర్ శిరీష, అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ మాడిశెట్టి శ్రీనివాస్, డెమో నవీన్, సబ్ యూనిట్ అధికారులు నందా, విజయేంద్రకుమార్, డీడీ నితిన్, చక్రపాణి పాల్గొన్నారు.

ధ్యాన మందిరం ప్రారంభం

గీసుకొండ : గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ కీర్తినగర్‌లో బ్రహ్మకుమారీల ధ్యాన మందిరాన్ని గురువారం ప్రారంభించారు. కీర్తినగర్ బ్రహ్మకుమారీల శాఖ 20 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చేపట్టారు. బీఆర్ఎస్ నాయకులు సుంకరి శివ, కీర్తినగర్ బీఆర్ఎస్ అధ్యక్షుడు గోరుకంటి లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

కల్నల్ రాజేష్‌కు వీడ్కోలు సన్మానం



రాజేష్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

హన్మకొండ అర్బన్: 8వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న కల్నల్ రాజేష్ కౌశిక్ బదిలీపై నైనిటాల్‌కు వెళ్తున్న సందర్భంగా ప్రభుత్వ పింగిళి మహిళా కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ చంద్రమౌళి మాట్లాడుతూ 8వ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ రాజేష్ కౌశిక్ మూడేళ్లుగా ఎన్‌సీసీ గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్‌గా అనేక మంది మహిళా కేడెట్లకు శిక్షణ ఇచ్చారని కొనియాడారు. కళాశాల ఎన్‌సీసీ మహిళా యూనిట్ ప్రారంభించిన నాటి నుంచి కేడెట్లకు మంచి శిక్షణ కల్పించినందుకు కళాశాల యాజమాన్యం తరఫున అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ రామకృష్ణారెడ్డి, డాక్టర్ సురేష్‌బాబు, సూపరింటెండెంట్ శ్రీనివాస్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకుడి కుటుంబానికి ఆర్థిక సాయం



చెక్కు అందజేస్తున్న కామర్స్ అధ్యాపకులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో కామర్స్ అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్న గాదె నాగేశ్వర్‌రావు.. ఈనెల 9న గుండెపోటుతో అకాల మరణం చెందారు. దీంతో కేయూ పరిధిలో సహచర కామర్స్ అధ్యాపకులంతా కలిసి బాధిత కుటుంబానికి గురువారం ఆర్థిక సాయం అందజేశారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కామర్స్ అధ్యాపకుడు డాక్టర్ మాదాసి కనకయ్య, పెండ్యాల సురేష్ ఆధ్వర్యంలో రూ.72,500 విలువగల చెక్కును నాగేశ్వర్‌రావు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ నవీన్, డాక్టర్ సురేష్, వేణుగోపాల్, నాగరాజు, డాక్టర్ ఫణీంద్రకుమార్, రాజేంద్రప్రసాద్, సంజీవ తదితరులు పాల్గొన్నారు. కాగా, నాగేశ్వర్‌రావు చిత్రపటానికి అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

న్యూశాయంపేటలో మందుబాబుల హల్‌చల్



గొడవకు దిగిన మందు బాబులు

కాజీపేట అర్బన్: 31వ డివిజన్ పరిధిలోని న్యూశాయంపేటలోని వైన్స్, బార్ ఎదుట మందు బాబులు హల్‌చల్ చేస్తూ ప్రయాణికులను ఇబ్బందులను గురి చేస్తున్నారు. న్యూశాయంపేట చౌరస్తాలోని వైన్ షాపు ఎదుట రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, కార్లు పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. రోడ్డుపై వాహనాలను నిలపడమేంటని అడిగితే గొడవకు దిగుతున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే, జనావాసాల్లోని బార్‌షాపులో మందు బాబులు గురువారం గొడవ దిగారు. దాంతో అసలేం జరుగుతుందో తెలియక కాలనీవాసులు భయాందోళనకు గురయ్యారు.